

జిల్లాలో పలువురు ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు జిల్లా ఎస్పి రవి ప్రకాష్ ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం విఆర్‌లో ఉన్న నాలం శ్రీనివాసరావును పాలకోడేరు ఎస్ఐగా నియమించారు. పాలకోడేరు పోలీస్‌స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ఎస్.రామచంద్రరావును భీమవరం డిసిఆర్‌బి ఎస్ఐగా నియమించారు. డిసిఆర్‌బి ఎస్ఐగా పని చేస్తున్న విజిఎస్ మూర్తిని కాళ్ల ఎస్ఐగా నియమించారు. ప్రస్తుతం కాళ్ల ఎస్ఐగా పనిచేస్తున్న ఆర్.మల్లికార్జున రెడ్డిని భీమవరం ట్రాఫిక్ ఎస్ఐగా నియమించారు. ప్రస్తుతం భీమవరం ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బండి మోహన్‌రావును భీమవరం రూరల్ ఎస్ఐగా నియమించారు. భీమవరం రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న వి.అప్పలరాజును విఆర్ కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉల్లాసం.. ఉత్సాహం..





మాట్లాడుతున్న బాలోత్సవం రూపకర్త డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు



రెండోరోజు కొనసాగిన హేలాపురి బాలోత్సవం

సాంస్కృతిక, అకడమిక్ పోటీల్లో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు

బాలోత్సవం కార్యక్రమాలతో పిల్లల్లో ఆత్మస్థయిర్యం

బాలోత్సవం రూపకర్త డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం మూడో పిల్లల సంబరాలు ఆదివారం రెండోరోజు సిఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. బాలోత్సవ కార్యక్రమాలకు మంచి స్పందన లభించింది. 60 రకాల కల్చరల్, అకడమిక్ పోటీలు ఒకే ఆవరణలో జాతరలా సాగాయి. రెండో రోజు ప్రారంభ కార్యక్రమంలో బాలోత్సవం రూపకర్త డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ కొత్తగూడెంలో 25 సంవత్సరాలపాటు తాను చేపట్టిన బాలోత్సవం అన్ని ప్రాంతాలకూ విస్తరించడం ఆనందంగా ఉందన్నారు. పిల్లల జీవితంలో బాలోత్సవం మరపురాని తీపి జ్ఞాపకమని చెప్పారు. పాశ్చాత్య విష సంస్కృతి వ్యాప్తి చెందిన ఈ రోజుల్లో బాల్యంలోనే అభ్యుదయ విలువలకు బాటలు వేయాల్సి ఉందన్నారు. చెడు సంస్కృతికి వ్యతిరేకంగా మంచి సంస్కృతిని ప్రోత్సహించేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, ఆహ్వాన సంఘం నాయకులు ఉప్పలపాటి చక్రపాణి, అడుసుమిల్లి నిర్మల, మారుబోయిన కోటేశ్వరరావు, విజిఎంవిఆర్.కృష్ణారావు, డి.హేమసుందర్, ముస్తఫా ఆలీ, సాయి కుమారి శంకర్, జె.సత్యనారాయణరాజు, ఎంఎస్.కాంతారావు, జి.నీలిమ, బి.మోహన్‌రావు, ఎబి.త్రిపురసుందరి, పి.కనకదుర్గ, పి.కస్తూరిబాయి, కె.శ్రీనివాస్, ఎంజిఎన్‌వి.రత్నం, వై.ఆనందనాయుడు, ఎస్.కస్తూరిరావు, శ్రీహరికోటి తదితరులు పాల్గొన్నారు.



జానపదాలకు విశేష ఆదరణ

బాలోత్సవం పిల్లల సంబరాల పోటీల్లో జానపద నృత్య పోటీలకు విశేష ఆదరణ లభించింది. 80కి పైగా టీములు జానపద నృత్య పోటీల్లో వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాల్గొని చూపరులను ఆకట్టుకున్నారు. పల్లె వాతావరణంతో కూడిన పాటలు, లంబాడీ జానపద నృత్యం, దేశభక్తి భావంతో ఉన్న పాటలు జానపద నృత్య రూపంలో పిల్లలు చక్కగా ప్రదర్శించారు. దేశభక్తిని ప్రేరేపించే అంశాలు, కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్న పాశ్చాత్య నాగరికత ప్రభావాలకు భిన్నంగా నేటి తరానికి అవసరమైన అభ్యుదయ అంశాలతో కూడిన లఘు నాటికలు ప్రదర్శన ఆకట్టుకుంది. ఏకపాత్రాభినయం, కోలాట నృత్యాలు, అభ్యుదయ పాటలు, విచిత్ర వేషధారణ, శాస్త్రీయ నృత్యం వంటి కల్చరల్ పోటీలు, మట్టి బొమ్మల తయారీ, క్విజ్, మెమొరీ, కథలు చెప్పడం వంటి అకడమిక్ పోటీలు పెద్దఎత్తున సాగాయి. రెండో రోజు పోటీల్లో దాదాపు నాలుగు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.



మట్టితో బొమ్మల తయారీ



చిన్నారుల కోలాటం





చిన్నారుల నృత్య సందడి



సంకల్ప దీక్షను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ఐక్య పోరాటాలతోనే సిపిఎస్ రద్దు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

భీమవరంలో సంకల్ప దీక్షకు తరలొచ్చిన ఉపాధ్యాయులు

24న ఢిల్లీలో చేపట్టిన ఆందోళనకు తరలి రావాలి : యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి పిలుపు

బిజెపి, వైసిపిలను ఇంటికి సాగనంపాలి : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం

'రాబోయే కాలం రాజకీయ పార్టీలకు ఎన్నికల కాలం.. మనకు మాత్రం పోరాటాల కాలం. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గమనంలో ఉంచుకుని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు కదిలొచ్చి సిపిఎస్ రద్దుకు ఐక్యంగా పోరాడాలి' అని ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పిలుపునిచ్చారు. గన్నవరం ధర్మస్థలిలో సంకల్ప దీక్ష భగ్నాన్ని నిరసిస్తూ స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం సంకల్ప దీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నేతల మెడలో ఎరుపు దండలు వేసి యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి దీక్షను ప్రారంభించారు. ఈ దీక్షకు జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. సాధిద్దాం.. పాత పెన్షన్, ఉద్యోగ భద్రత.. ప్రభుత్వం బాధ్యత, సిపిఎస్ వద్దు.. ఒపిఎస్ ముద్దు, ఒకటే సర్వీస్.. ఒకటే పెన్షన్ అంటూ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. సిపిఎస్ రద్దుపై ఇచ్చిన హామీని నెరవేర్చాలని అడుగుతుంటే ఉద్యోగ, ఉపాధ్యాయులపై నిర్బంధానికి పాల్పడటం నియంతృత్వానికి నిదర్శనమన్నారు. దీక్షకు మద్దతు తెలిపిన ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసే వరకూ నిరంతరం పోరాటం సాగిస్తామన్నారు. సిపిఎస్ రద్దు కోసం శాసనమండలిలో పోరాడతామన్నారు. పోరాటాలను అణిచివేసేలా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఇచ్చిన హామీని వైసిపి ప్రభుత్వం అమలు చేయలేదని, హామీ ఇవ్వని రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌కు వెళ్తున్నాయని అన్నారు. ఒపిఎస్‌కు వెళ్తే తీసుకునే రుణాలు మూడు శాతమే ఇస్తామని కేంద్రం చెబుతుందని విమర్శించారు. సిపిఎస్ రద్దు కోసం పోరాటం జగన్‌పైనే కాకుండా బిజెపిపైనా చేయాలన్నారు. అదాని, అంబానీ, పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్లు రుణమాఫీ చేస్తారే తప్ప ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై నోరు మెదపరని విమర్శించారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. సిపిఎస్ రద్దు కోరుతూ ఈ నెల 24న ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద చేపట్టబోయే ఆందోళనకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ నియంతలు రాజ్యమేలుతున్నారని, దీన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. హామీని అమలు చేయమని అడిగితే ఉద్యోగ ఉపాధ్యాయులపై అక్రమ కేసులు పెట్టి జైల్లో కూర్చోబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీక్షలో మహిళా నేత కె.శ్రీదేవి, సిపిఎస్ యుఎస్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా నేతలు సిహెచ్.పట్టాభిరామయ్య, కె.శ్రీరామకృష్ణప్రసాద్, ఎస్.రత్నంరాజు, జి.రామకృష్ణంరాజు, క్రాంతికుమార్, బి.శివప్రసాద్, సిహెచ్.కుమార్‌బాబ్జి, బి.ఏసుబాబు, ఎం.శ్రీనివాస్‌బాబు, జివి.రామానుజరావు, సిహెచ్.కృష్ణమోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

బిజెపి, వైసిపిలను ఇంటికి సాగనంపాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ఎనిమిదిన్నరేళ్లుగా అటు బిజెపి, మూడున్నరేళ్లుగా ఇటు వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను ఇంటికి సాగనంపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ పిలుపునిచ్చారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సంకల్ప దీక్షకు సిఐటియు తరపున సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులు, చట్టాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల ఇంగ్లాండులో 52 లక్షల మంది ఉద్యోగ, కార్మికులు రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారని గుర్తు చేశారు. అటువంటి పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, సహాయ కార్యదర్శి ఎం.ఆంజనేయులు మాట్లాడారు.

నికరంగా పోరాడేదే ఎర్రజెండా

పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జేమ్స్

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులతోపాటు సమస్యలపై నికరంగా పోరాడేది ఎర్రజెండాయేనని పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జేమ్స్ అన్నారు. యుటిఎఫ్ చేపట్టిన సంకల్ప దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడారు. వైసిపి అధికారం చేపట్టాక ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. పెన్షనర్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. యుటిఎఫ్ ఆందోళనలకు పెన్షనర్ల సంఘం పూర్తి మద్దతు తెలియజేస్తుందన్నారు.

'బోరు'మంటున్నారు..!

'జలకళ'పై రైతుల్లో తీవ్ర అసంతృప్తి

వేయాల్సిన బోర్లు లక్ష్యం 3,705

రెండున్నరేళ్లలో వేసినవి 1,178 మాత్రమే

సగానికిపైగా బోర్లకు కానరాని విద్యుత్ కనెక్షన్

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లు

దిక్కుతోచక రైతులు లబోదిబో



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం తెచ్చిన 'వైఎస్ఆర్ జలకళ' పథకం రైతులకు ఏమాత్రం అక్కరకు రాని దుస్థితి నెలకొంది. ఈ పథకం అమలు అత్యంత పేలవంగా ఉందంటూ రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్న తీరుతో బోర్లు వేసుకునేందుకు సైతం చాలాచోట్ల రైతులు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. 2020 సెప్టెంబర్ 28న వైఎస్ఆర్ జలకళ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం 3,705 బోర్లు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గడిచిన రెండున్నరేళ్లలో అధికారుల లెక్కల ప్రకారం చూస్తే 1,178 బోర్లు వేసినట్లు చూపిస్తున్నారు. లక్ష్యం మేరకు రెండువేలకుపైగా బోర్లు వేయాల్సి ఉన్నప్పటికీ ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఇక వేసినట్లు లెక్కలు చూపుతున్న బోర్లలో సగానికి కూడా విద్యుదీకరణ జరగలేదని రైతులు చెబుతున్నారు. అంటే బోరు వేసినా రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరలేదని తేటతెల్లమవుతోంది. జలకళ పథకంలో ఉన్న లోపాలే దీనికి కారణంగా రైతులు చెబుతున్నారు. రెండున్నర ఎకరాల నుంచి ఐదెకరాలు వరకూ ఉన్న ప్రతి రైతూ జలకళలో బోరు వేసుకునేందుకు అర్హులే. బోరు కోసం దరఖాస్తు చేసుకుని నెలలు, ఏళ్లు గడుస్తున్నా వేసిన పరిస్థితి లేదని రైతులు చెప్పుకొస్తున్నారు. జలకళ పర్యవేక్షణ సైతం అత్యంత దారుణంగా ఉందనే భావన రైతులకు వ్యక్తమవుతోంది. ఈ పథకంలో కాంట్రాక్టర్‌దే ఇష్టారాజ్యం అన్నట్లు సాగుతోంది. తొలుత విద్యుత్ కనెక్షన్ కూడా ప్రభుత్వమే ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తర్వాత విద్యుత్ కనెక్షన్ రైతులు వేయించుకోవాలని మాటమార్చింది. ఇది అత్యంత ఖర్చుతో కూడుకున్న పని కావడంతో రైతులు జంకుతున్నారు. 2022 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2022 నవంబర్ 30వ తేదీ వరకూ జిల్లాలో 127 బోర్లు మంజూరైతే 57 బోర్లకు మాత్రమే డ్రిల్లింగ్ జరిగింది. దీనిలో విద్యుదీకరణ పూర్తయిన బోర్లు కేవలం ఆరు మాత్రమే. దీన్నిబట్టి జలకళ జిల్లాలో ఏవిధంగా ముందుకు సాగుతుందో చెప్పనక్కర్లేదు. బోరు వేయాలంటే కనీసంగా రూ.ఐదు లక్షలకుపైనే ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం రూ.రెండు లక్షలు మాత్రమే జలకళ పథకంలో అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఉచిత బోరు అంటూ చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేకుండాపోయిందని రైతులు చెబుతున్నారు.

మీరు బోరు వేసుకుంటే ఫొటో తీసుంటాం

రైతులకు బోరు మంజూరైతే సంబంధిత కాంట్రాక్టర్ రైతులతో మాట్లాడి బోరు వేయాల్సి ఉంటుంది. అయితే చాలాచోట్ల ఆవిధంగా కాకుండా రైతులే అన్ని ఖర్చులూ పెట్టుకుని బోరు వేసుకోవాలని కాంట్రాక్టర్లు సూచిస్తున్నారు. బోరు వేసుకున్న తర్వాత తాము వచ్చి రిగ్గుతో ఫొటో తీసుకుంటామని, ప్రభుత్వం సొమ్ము వేసిన తర్వాత రైతుకు ఇస్తామని చెబుతున్నారు. దీనిలో అధికార పార్టీ నాయకుల జోక్యం విపరీతంగా ఉంటోందని రైతులు చెప్పుకొస్తున్నారు. బోరు వేయించుకునే రైతులు కనీసంగా రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు అనేక మండలాల్లోని రైతులు వాపోతున్నారు. సొంత సొమ్ము ఖర్చు పెట్టుకుని బోరు వేసుకునే స్థోమత ఉంటే జలకళ పథకంలో దరఖాస్తు చేసుకోవడం ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే చాలాచోట్ల మంజూరైన బోర్లు కూడా వేయకుండా ఉండిపోయినట్లు రైతులు చెబుతున్నారు. జలకళ పథకంలో ఏదైనా సమస్య వస్తే గ్రామస్థాయిలో రైతులు ఏఅధికారిని కలవాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో కాంట్రాక్టర్, స్థానిక వైసిపి నాయకులు చెప్పిందే వేదం అన్నట్లు తయారైంది. ఇలా అనేక కారణాలు ఉండటంతో రైతులు బోర్లు వేసుకునేందుకు సైతం ముందుకు రావడం లేదని తెలుస్తోంది. జలకళ పథకంలో బోర్లు వేసుకునే విషయంలో ఎదురవుతున్న సమస్యలతో రైతులు బోరుమంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని జలకళ అమలులో సమస్యలపై కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తే రైతులు ముందుకొచ్చే పరిస్థితి ఉంటుంది. లేకపోతే ప్రభుత్వం తలపెట్టిన ఈ కార్యక్రమం ఎండమావిగానే మిగిలిపోయే పరిస్థితి ఏర్పడనుంది.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

మహిళలకు రక్షణ కరువు

ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

ప్రజాశక్తి - నరసాపురం

మహిళలపై రోజురోజుకూ దాడులు పెరుగుతున్నాయని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తెలిపారు. ఐద్వా పట్టణ 11వ మహాసభ పి.పార్వతి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల సభ్యత్వంతో ఐద్వా పనిచేస్తోందని తెలిపారు. మహిళా హింసకు వ్యతిరేకంగా పనిచేస్తోందని, వార్డు, పట్టణ, గ్రామ కమిటీల ద్వారా మహిళలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో నదిలో స్నానం చేస్తున్న దళిత మహిళలపై దాడులను, నెల్లూరులో బండారు మేఘన యాసిడ్ దాడిని ఖండించాలని తెలిపారు. మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వాలు నిస్సిగ్గుగా పాలన సాగిస్తున్నాయని తెలిపారు. అనంతరం ఐద్వా పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షురాలుగా కవురు లక్ష్మి, పట్టణ కార్యదర్శిగా అడ్డాల మీనా కుమారి, సహాయ కార్యదర్శిగా బూడిద భువనేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా పోరాడి పార్వతి ఎన్నికయ్యారు.

రైతాంగానికి బడ్జెట్ నష్టదాయకం

ప్రజాశక్తి - పెంటపాడు

కేంద్ర బడ్జెట్ నష్టదాయకమని, రైతుల్ని అధోగతి పాలు చేసే విధంగా బడ్జెట్ ఉందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి విమర్శించారు. ఆదివారం పెంటపాడులో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ ఈ బడ్జెట్ కార్పొరేటర్లకు అనుకూలంగా రైతాంగానికే నష్టదాయకంగా ఉందని తెలిపారు. ఒకపక్క రైతాంగం వ్యవసాయం గిట్టుబాటు లేక క్రాప్ హాలిడే ప్రకటించిందని, వారిపై దాడి సరికాదని విమర్శించారు. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగి వ్యవసాయం గిట్టుబాటు కాని పరిస్థితుల్లో ఈ బడ్జెట్ ఏ విధంగానూ ఉపయోగంలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపురపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి కరక వెంకట్రావు, మండల ఉపాధ్యక్షులు ఆడప ఆంజనేయులు, పెనగంటి దుర్గా పాల్గొన్నారు.

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుండి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సర్వే కొబ్బరి తోటలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

రాళ్లు పైకిలేచి.. నరకయాతన..!

బ్రాహ్మణచెరువు నుంచి వెలగలవారిపాలెం-జుత్తిగ వంతెన రోడ్డు

ప్రజాశక్తి - పెనుమంట్ర

బ్రాహ్మణచెరువు నుంచి వెలగలవారిపాలెం, జుత్తిగ వంతెన వరకూ రోడ్డు అధ్వానంగా తయారైంది. సుమారు మూడు కిలోమీటర్లు మేర రహదారిపై రాళ్లు పైకిలేచి వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఏళ్ల తరబడి రహదారి ఇలాగే ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని, మరమ్మతులతో సరిపెడుతున్నారు గానీ, రహదారి నిర్మాణానికి మాత్రం నోచుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిస్తే ఆ రోడ్డు వెంబడి వెళ్లాలంటే భయమేస్తోందని వాపోతున్నారు. ఈ రహదారి గుండా కనీసం ఆటోలు కూడా రాకపోకలు లేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో బైక్‌లు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్య చేపట్టాలని వాహనదారులు వేడుకుంటున్నారు.


రాళ్లుపైకిలేచి గోతులతో అధ్వానంగా ఉన్న వెలగలవారిపాలెం రహదారి


In The Court Of The Senior Civil Judge::Sathupalli
I.A.No. 2/2021 and I.A.No. 3/2021, O.S.No. 67/1989

Between:
Gandra Anasurya
...Petitioner /Plaintiff
AND
Bandi Samrajyam (Died) and Others
...Respondents /Defendants

పై కేసులో మీర్జా హజ్మలే హుస్సేన్, తండ్రి: మీర్జా, R/o. ఇందిరా నగర్, రామాయంపేట, పెట్రోల్ బంకు దగ్గర, నూజివీడు కాపురస్తుఐన మీరు రెస్పాండెంటు నెం.25 / ప్రతివాది నెం. 13 అయి ఉన్నారు. సదరు కేసు మీ యొక్క హాజరు నిమిత్తం **ది.10-02-2023వ తేదీన వాయిదా కలదు. కావున మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టులో హాజరు కావలయును.** అట్లు హాజరు కాని ఎడల సదరు కేసును మీ పరోక్షములో తీర్మానించబడునని మీకు ఇందుమూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

సి హెచ్.కృష్ణప్రసాదు,
అడ్వకేట్, సత్తుపల్లి
ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
సెల్: 98854 45010



సత్యనారాయణరాజును సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ రామరాజు

గ్రామాభివృద్ధికి సత్యనారాయణరాజు కృషి

ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం గ్రామ పంచాయతీలో 11 ఏళ్ల పాటు సర్పంచిగా గోకరాజు సత్యనారాయణరాజు గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. ఆదివారం జువ్వలపాలెంలో మాజీ గ్రామ సర్పంచి గోకరాజు సత్యనారాయణరాజు 91వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు గోకరాజు సత్యనారాయణరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీలు కనుమూరి బాపిరాజు, గోకరాజు గంగరాజు మాట్లాడుతూ ఆయన మంచినీటి చెరువు, ఓహెచ్ ఆర్, షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్, పశువుల ఆసుపత్రి నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకటశివరామరాజు, టిడిపి మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, డిసిసిబి కళాశాల అధ్యక్షులు గోకరాజు నరసింహరాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులందరికీ, బంధువులకు భోజనం ఏర్పాటు చేశారు.


పెనుమంచిలిలో కాపు కళ్యాణ మండపం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

సంక్షేమ పథకాలే విజయానికి నాంది

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో విజయానికి నాంది పలుకుతాయని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం పెనుమంచిలిలో రూ.కోటితో నిర్మించనున్న కాపు సీతారామ కళ్యాణ మండపం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, ఎన్నికల మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలు చేసున్నామని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో గడపగడపకూ కార్యక్రమాన్ని చేపడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గణేశుల శేషవాణి సుబ్బారావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, గ్రామ కమిటీ అధ్యక్షులు నక్క ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లులో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రైస్ మిల్లు ప్రాంగణంలో ఆదివారం జరిగిన భారీ అన్నసమారాధన కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది, యాత్రకులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారు.

'వైసిపి బలోపేతానికి చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో జోడు పదవులు నిర్వహిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ వల్ల నియోజకవర్గంలో పార్టీ బలహీనంగా ఉందని వైసిపి జిల్లా కార్యదర్శి ఆరేపల్లి సింహాద్రి ఆదివారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. కవురు శ్రీనివాస్ జెడ్‌పి ఛైర్మన్‌తో పాటు వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారని, దీంతో పార్టీలో కుమ్ములాటలు, వర్గాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఒకపక్క నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉంటే వైసిపి బలహీనపడుతోందని, అధిష్టానం కలుగజేసుకొని పాలకొల్లుకు ప్రత్యేక ఇన్‌ఛార్జిని ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్న శెట్టిబలిజ, గౌడ్ కులస్తులు రెండు గ్రూపులుగా విడిపోయారని, దీంతో వచ్చే ఎన్నికల్లో పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని, పేర్కొన్నారు. నియోజకవర్గంలో అన్ని కులాలను ఏకతాటిపై నిలబెట్టి పనిచేసే నాయకుడికి ఇన్‌ఛార్జి ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో లోకల్, నాన్ లోకల్ అనే భేదాభిప్రాయం నాయకుల్లో ఏర్పడిందని, అధిష్టానం దీనిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

సూర్యనారాయణరాజుకు ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహదేవపట్నం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వేగేశ్న సూర్యనారాయణరాజును ఆదివారం ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యనారాయణరాజు పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ నిరంతరం పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారని, అటువంటి వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడడం దురదృష్టకరమన్నారు. ఆయన త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. సూర్యనారాయణ రాజును పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, నాయకులు జుత్తిగ శ్రీనివాస్, వనిమా శ్రీనివాస్, గంధం బుజ్జి, కొనగళ్ల నాగేశ్వరరావు, కాగిత బుజ్జి, పోలుబోతు రాము, కరిమెరక సత్య, పాలపర్తి బాలాజీ ఉన్నారు.

మంత్రి కారుమూరిని కలిసిన ముద్రగడ

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరావుతో కాపు నాయకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆదివారం మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల మంత్రి కారుమూరి మామయ్య విశాఖపట్నంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ముద్రగడ మంత్రిని పరామర్శించారు. వీరిద్దరి మధ్య కొంతసేపు చర్చలు జరిగాయి. మంత్రి కుటుంబానికి తన సానుభూతిని ముద్రగడ వ్యక్తం చేశారు. అనంతరం తిరిగి కిర్లంపూడి బయలుదేరి వెళ్లిపోయారు.

విఆర్‌ఎల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం విఆర్‌ఎల నూతన కమిటీ ఎన్నిక ఆదివారం తాడేపల్లిగూడెం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు బొంగా గణేష్‌రావు, భీమవరం డివిజన్ బివిఎవి.పండు, నక్క సుబ్బారావు అధ్యక్షత వహించారు. గుమ్మల వెంకటేశ్వరరావు ప్రెసిడెంట్‌గా, నరసింహమూర్తి వైస్ ప్రెసిడెంట్‌గా, మాకపాటి నరసయ్య కార్యదర్శిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బొంగా గణేష్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫేస్ అటెండెన్స్ నుంచి విఆర్‌ఎలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎలు మేకా రాములు, ఆటరగడ్డ తాతారావు, అయినవిల్లి మీనారాణి, షేక్ సుభాన్ బేబీ, వెలుబుడి శ్రీలక్ష్మీదేవి పాల్గొన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు నష్టం కలిగించే సిపిఎస్‌ను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనేక సంవత్సరాలుగా సిపిఎస్ రద్దుకై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పోరాడుతున్నారని పేర్కొన్నారు. రెండు రోజులుగా విజయవాడలో శాంతియుతంగా దీక్షలు నిర్వహించడానికి ప్రయత్నిస్తున్న ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించడం దుర్మార్గమని తెలిపారు. ఈ నిర్బంధాన్ని సిపిఎం ఖండిస్తోందని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తానని ప్రగల్భాలు పలికారని తెలిపారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు అవుతున్నా నేటికీ సిపిఎస్‌ను రద్దు చేయకుండా, ఒపిఎస్‌ను పునరుద్ధరించకుండా మోసం చేశారని విమర్శించారు. ఒపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకొస్తానని చెప్పడం మోసపూరితమని తెలిపారు. దేశంలోని పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ వంటి అనేక రాష్ట్రాలు ఒపిఎస్‌ను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూడా ఒపిఎస్ అమలు చేయాలని, సిపిఎంను రద్దు చేయాలని కోరారు. దారుణమైన నిర్బంధాన్ని ఆపాలని కోరారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కులను కూడా కాలరాయడం అంటే రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడమేనని విమర్శించారు. అనేక సందర్భాల్లో ఉద్యోగులను, ఉపాధ్యాయులను గౌరవిస్తామని, వారు ప్రభుత్వానికి మూల స్తంభాలని చెబుతూనే మరోవైపున వారు చేస్తున్న ఆందోళనపై ఉక్కుపాదం మోపడం అన్యాయమని తెలిపారు. వారి న్యాయమైన ఆందోళనకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లు చేసే ఆందోళనలకు ప్రజలందరూ మద్దతు తెలపాలని కోరారు.

దేవాలయాలు సంప్రదాయాలకు నిలయాలు

ప్రజాశక్తి - వీరవాసరం

దేవాలయాలు సాంస్కృతిక, సంప్రదాయాలకు నిలాయాలుగా ఉంటాయని పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. చింతలకోటిగరువు పంచాయతీ పరిధి నడపనవారిపాలెంలో నిర్మించిన శ్రీవల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విగ్రహ ప్రతిష్టలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు దాసరి మహాలక్ష్మి, గెడ్డం భారతీదేవి, యర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

భీమవరం రూరల్: గునుపూడిలోని సోమేశ్వర జనార్ధన స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సిహెచ్ మనవేంద్రరాయ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇఒ, ధర్మకర్తలు న్యాయమూర్తిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు


బాధితులకు నిత్యావసరాలు, బియ్యం, బట్టలు అందిస్తున్న తాతాజీ

పాలకొల్లు మావుళ్లమ్మపేటలో రెండు రోజుల క్రితం సంభవించిన అగ్నిప్రమాదంలో నాలుగు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులను డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ ఆదివారం పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. బట్టలు, బియ్యం, కంచాలు, గ్లాసులు, బిందెలు అందించారు. బాధిత కుటుంబాలకు వెంటనే టిడ్కో గృహాల్లో వారి ప్లాట్లకు వెళ్లేందుకు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధనాల దుర్గమ్మ , ధనాల శ్రీను, యడ్ల సత్యనారాయణ, మేకా రాజ, జోగాఢ ఉమామహేశ్వరరావు, జోగి వడ్డికాసులు, జోగి వెంకటేశ్వరరావు, బెజ్జవరపు నాగరాజు, చెన్ను విజయ్, గంటా నరేష్, పెచ్చెట్టి కృష్ణాజి, పనస శ్రీను, చోదగిరి రమేష్ బాబు, నారిగడప అప్పారావు, పుల్లూరి నరేష్, కృష్ణమోహన్, షేక్ వల్లి, రేలంగి శ్రీను, పాలపర్తి కృపనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రంలోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు తీర్మానం చేశారు. 1965-66 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమావేశం అయ్యారు. 56 సంవత్సరాల తరువాత తొలిసారిగా కలుసుకున్న వారు ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తండ్రి సూర్యనారాయణరాజు కూడా ఈ విద్యార్థులతో కలిసి చదువుకున్న వారే. ప్రభాస్ అభిమానులు ఎం.సత్యనారాయణ, దొంగ కనకంలు సుమారు రూ.20 వేలు వెచ్చించి ఒక ఇనుప బీరువా, పూర్వ విద్యార్థులు రూ.20 వేలు వెచ్చించి మరొక ఇనుప బీరువాను పాఠశాల రికార్డులు భద్రపరుచుకునేందుకు సిబ్బందికి అందించారు. బాల్యమితులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల ఆవరణలో ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఆనాటి విద్యాబుద్ధులు నేర్పిన డ్రిల్ మాస్టర్ కె.అప్పలనరసింహరాజు, సీత దంపతులను ఘనంగా సత్కరించారు. మిత్రుల కలయికకు గుర్తుగా జ్ఞాపికలను అందించారు. బాల్య మిత్రుల కలయికకు కృషిచేసిన వేముల సర్వేశ్వరరావు, రాయుడు లక్ష్మణుడు, వుద్దగిరి సుబ్బారావు, గ్రంధి బాబి, బి.పరశురాముడు, రాయుడు వెంకటేశ్వరరావు, సంకు నరసింహరావులను సహచరులు అభినందించారు.

పేద విద్యార్థికి 'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాండిచ్చేరి కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న యలమంచిలి మండలం అబ్బిరాజుపాలేనికి చెందిన పేద విద్యార్థి వాతాడి సాయికుమార్‌కు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. విద్యార్థి ఆర్థిక ఇబ్బందులు పాలకొల్లు మానవత దృష్టికి రావడంతో స్పందించిన పాలకొల్లు మానవత సభ్యులు ఆదివారం అతనికి రూ.పది వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు మానవత కోశాధికారి షేక్ పీర్ సాహెబ్, ఛైర్మన్ ముత్యాల రామారావు, ఆత్మీయ కమిటీ ఛైర్మన్ ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా పెదపుల్లేరు సత్తెమ్మ జాతర

ఉండి : పెదపుల్లేరు గ్రామదేవత సత్తెమ్మవారి 58వ జాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా కప్పి మెమెంటో అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చేసిన ఏర్పాట్లు అభినందనీయమన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కలిదిండి రామకృష్ణంరాజు మాట్లాడుతూ సోమవారం ఆలయం ఆవరణలో అఖండ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యుదాఘాతానికి గురై ఒక భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలపల్లి పంచాయతీ పరిధి గెదల్లవంపు గ్రామానికి చెందిన బంధన మహాలక్ష్మిరావు, శ్రీనివాసరావు(36) భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. గ్రామంలో కాంక్రీట్ వేయనున్న భవనానికి ఊచలు అమరుస్తుండగా ప్రమాదవశాత్తు సమీపంలోని 11 కెవి విద్యుత్ వైరకు ఊసలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. శ్రీనివాసరావు భవనంపై నుంచి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. వారిద్దరిని చికిత్స నిమిత్తం నరసాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు శ్రీనివాసరావు మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్రీనివాసరావుకు భార్య, కుమారులు ఉన్నారు. మహాలక్ష్మిరావును మెరుగైన వైద్య నిమిత్తం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉండి బస్టాండ్‌లో గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - ఉండి

ఉండి బస్టాండ్‌లో ఎస్ఐ కె.గంగాధరరావు తన సిబ్బందితో కలిసి 22 కేజీల గంజాయి, 952 గ్రాముల వెండిని ఆదివారం సాయంత్రం పట్టుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపిన వివరాల ప్రకారం...ఉండి బస్టాండ్ వద్ద మూటలతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పరిశీలించగా ఆ మూటల్లో 22 కేజీల గంజాయి, 952 గ్రాముల వెండి గుర్తించినట్లు వారు తెలిపారు. ఈ నిందితులు విజయవాడ అడ్డాగా మలుచుకుని రాజస్థాన్ నుంచి గంజాయి వ్యాపారం చేస్తూ ఉంటారని, దొంగతనాలకు పాల్పడతారని ఎస్ఐ తెలిపారు.

ప్రకటన
(O21 R66 CPC)
మహారాజశ్రీ తణుకు 4వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S.22/2015, E.P.11/2019

డి. హెచ్. ఆర్:
డా॥రిమ్మలపూడి సూర్యరాజు

జె. డి. ఆర్:
తోట రామలక్ష్మీకాంతం, భర్త: రామకృష్ణ, డో.నెం. 23-15-68, సుందరరామనగర్, హరిశ్చంద్ర టవర్సు వద్ద, ఎల్ఐసి ఆఫీసు వద్ద, సజ్జాపురం, తణుకు.

పై నెంబరులో డిహెచ్ఆర్ గారికి రావలసిన డిక్రీ అవార్డు ఖర్చులు వగైరాలు నిమిత్తం ఇ.పి.షెడ్యూలు దాఖలా మీ సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో గల ఆస్థికి విక్రయ ప్రకటన షరతులు (O21 R66 CPC) నిర్ణయించుటకు గాను మీకు కోర్టు వారి ద్వారానున్నా రిజిష్టర్డు పోస్టులో నున్న నోటీసులు పంపుచున్నాను తీసుకొనక Avoid చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా సదరు సంగతి మీకు తెలియజేయడమైనది. మీ అభ్యంతరములు ఏమైనా ఉన్నచో **ది.24-02-2023 ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానం జరుగునని తెలుపడమైనది.

వెలిచేటి గోవిందరాజు
అడ్వకేట్ ఫర్ డిహెచ్ఆర్,
తణుకు, 2-2-23. తణుకు. సెల్: 98491 22938

గ్రామపంచాయితీ కార్యాలయము-సంకర్షణపురం

ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

ఆర్.సి.నెం.01/2023 **టెండరు ప్రకటన** **తేది.02-02-2023**

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, సంకర్షణపురం గ్రామ పంచాయితీ యందు 2023-2024 సం॥నకు గాను ఈ దిగువ ఉదహరించిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేబరును సప్లై చేయుటకు ది.10-02-2023 మధ్యాహ్నం గం॥ 02:00 ని॥లకు సంకర్షణపురం గ్రామ పంచాయితీ కార్యాలయము నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడి తిరిగి అదే రోజు మధ్యాహ్నం గం॥ 02:30 ని॥లకు హాజరు కాబడిన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయ పని వేళలయందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	పని కాలము	డిపాజిట్టు
1.	పారిశుధ్య పనులు నిర్వహణ కార్యాలయం నిమిత్తం ఒకరు (1) వ్యక్తి సేవలు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.1000/-
2.	PWS స్కీము నిర్వహణ, స్కీము మోటారు ఆపరేటర్‌గా ఒకరు (1) వ్యక్తి సేవలు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	

సం/- **సంకుల వెంకటనాగరాజు**
సర్పంచ్, గ్రామ పంచాయితీ సంకర్షణపురం
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

సం/- **శ్రీ సి.హెచ్.వెంకటరమణ**
పంచాయితీ కార్యదర్శి సంకర్షణపురం
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయితీ కార్యాలయము-పెనుమల్లి

ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

ఆర్.సి.నెం.01/2023 **టెండరు ప్రకటన** **తేది.02-02-2023**

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, పెనుమల్లి గ్రామ పంచాయితీ యందు 2023-2024 సం॥నకు గాను ఈ దిగువ ఉదహరించిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేబరును సప్లై చేయుటకు ది.10-02-2023 మధ్యాహ్నం గం॥ 12:00 ని॥లకు పెనుమల్లి గ్రామ పంచాయితీ కార్యాలయము నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడి తిరిగి అదే రోజు మధ్యాహ్నం గం॥ 12:30 ని॥లకు హాజరు కాబడిన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయ పని వేళలయందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	పని కాలము	డిపాజిట్టు
1.	పారిశుధ్య పనులు నిర్వహణ కార్యాలయం నిమిత్తం ఒకరు SWPC షెడ్డు నిమిత్తం ఇద్దరు మొత్తం ముగ్గురు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	
2.	PWS స్కీము నిర్వహణ, స్కీము మోటారు ఆపరేటర్‌గా ఒకరు (1) వ్యక్తి సేవలు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.3000/-
3.	ఎలక్ట్రీషియన్, వీధి దీపములు రిపేర్లు చేయుటకు ఒకరు (1) వ్యక్తి సేవలు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	

సం/- **శ్రీ జంగం వెంకటేశ్వరరావు**
సర్పంచ్, గ్రామ పంచాయితీ పెనుమల్లి
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

సం/- **శ్రీ సి.హెచ్.వెంకటరమణ**
పంచాయితీ కార్యదర్శి పెనుమల్లి
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయితీ కార్యాలయము-గురజ

ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

ఆర్.సి.నెం.01/2023 **టెండరు ప్రకటన** **తేది.02-02-2023**

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, గురజ గ్రామ పంచాయితీ యందు 2023-2024 సం॥నకు గాను ఈ దిగువ ఉదహరించిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేబరును సప్లై చేయుటకు ది.10-02-2023 మధ్యాహ్నం గం॥ 01:00 ని॥లకు గురజ గ్రామ పంచాయితీ కార్యాలయము నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడి తిరిగి అదే రోజు మధ్యాహ్నం గం॥ 01:30 ని॥లకు హాజరు కాబడిన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయ పని వేళలయందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	పని కాలము	డిపాజిట్టు
1.	పారిశుధ్య నిర్వహణ పనులు SWPC షెడ్డు నిమిత్తం నలుగురుది.31-03-2024 వరకు	ది.01-04-2023 నుండి	
2.	PWS స్కీము నిర్వహణ, మోటారు ఆపరేటర్‌గా ఒకరు, ట్యాంకు వాచర్‌గా ఒకరు మొత్తం ఇద్దరు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.3000/-
3.	ఎలక్ట్రీషియన్, వీధి దీపములు రిపేర్లు చేయుటకు ఒకరు (1) వ్యక్తి సేవలు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	

సం/- **శ్రీమతి మంచాల సరస్వతి**
సర్పంచ్, గ్రామ పంచాయితీ గురజ
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

సం/- **శ్రీ సి.హెచ్.వెంకటరమణ**
పంచాయితీ కార్యదర్శి గురజ
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయితీ కార్యాలయము-దాకరం

ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

ఆర్.సి.నెం.01/2023 **టెండరు ప్రకటన** **తేది.01-02-2023**

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, దాకరం గ్రామ పంచాయితీ యందు 2023-2024 సం॥నకు గాను ఈ దిగువ ఉదహరించిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేబరును సప్లై చేయుటకు ది.10-02-2023 మధ్యాహ్నం గం॥ 12:00 ని॥లకు దాకరం గ్రామ పంచాయితీ కార్యాలయము నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడి తిరిగి అదే రోజు మధ్యాహ్నం గం॥ 12:30 ని॥లకు హాజరు కాబడిన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయ పని వేళలయందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	పని కాలము	డిపాజిట్టు
1.	పారిశుధ్య పనులు నిర్వహణ కార్యాలయం నిమిత్తం ఒకరు SWPC షెడ్డు నిమిత్తం ఇద్దరు మొత్తం ముగ్గురు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	
2.	PWS స్కీము నిర్వహణ, స్కీము మోటారు ఆపరేటర్‌గా ఒకరు (1) వ్యక్తి సేవలు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.3000/-
3.	ఎలక్ట్రీషియన్, వీధి దీపములు రిపేర్లు చేయుటకు ఒకరు (1) వ్యక్తి సేవలు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	

సం/- **శ్రీ జాస్తి రాఘవేంద్రరావు**
సర్పంచ్, గ్రామ పంచాయితీ దాకరం
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

సం/- **శ్రీ సి.హెచ్.వెంకటరమణ**
పంచాయితీ కార్యదర్శి దాకరం
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయితీ కార్యాలయము-పేరూరు

ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

ఆర్.సి.నెం.01/2023 **టెండరు ప్రకటన** **తేది.01-02-2023**

ఏలూరు జిల్లా, ముదినేపల్లి మండలం, పేరూరు గ్రామ పంచాయితీ యందు 2023-2024 సం॥నకు గాను ఈ దిగువ ఉదహరించిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేబరును సప్లై చేయుటకు ది.10-02-2023 మధ్యాహ్నం గం॥ 01:00 ని॥లకు పేరూరు గ్రామ పంచాయితీ కార్యాలయము నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించబడి తిరిగి అదే రోజు మధ్యాహ్నం గం॥ 01:30 ని॥లకు హాజరు కాబడిన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయ పని వేళలయందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరము	పని కాలము	డిపాజిట్టు
1.	పారిశుధ్య పనులు నిర్వహణ కార్యాలయం నిమిత్తం ఒకరు SWPC షెడ్డు నిమిత్తం ఇద్దరు మొత్తం ముగ్గురు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	
2.	PWS స్కీము నిర్వహణ, స్కీము మోటారు ఆపరేటర్‌గా ఒకరు (1) వ్యక్తి సేవలు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	రూ.3000/-
3.	ఎలక్ట్రీషియన్, వీధి దీపములు రిపేర్లు చేయుటకు ఒకరు (1) వ్యక్తి సేవలు	ది.01-04-2023 నుండి ది.31-03-2024 వరకు	

సం/- **శ్రీమతి పుట్టి మాధవి రాణి**
సర్పంచ్, గ్రామ పంచాయితీ పేరూరు
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

సం/- **శ్రీ సి.హెచ్.వెంకటరమణ**
పంచాయితీ కార్యదర్శి పేరూరు
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా